పంచాయతీల్లో మరుగుదొడ్ల కరువు

- సమావేశాలు, గ్రామసభల్లో ఇక్కట్లు
- మహిళా ప్రజాప్రతినిధులు, అధికారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



భీంపూర్ పంచాయతీ కార్యాలయం

నార్నూర్: ప్రతి ఇంటా మరుగుదొడ్డి నిర్మించు కోవాలంటూ అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నారు. మహిళా ఆత్మగౌరవం పేరుతో వీటిని నిర్మించుకోనేలా చర్యలు తీసుకున్నారు. నిర్మించుకోకపోతే ప్రభుత్వ పథకాలు నిలిపివేస్తామని హెచ్చరించారు. దీంతో నార్నూర్, గాదిగూడ ఉమ్మడి మండలంలో వీటి నిర్మాణాల వేగం పుంజుకుంది. అయితే పంచాయతీ కార్యాలయాల్లో మరుగుదొడ్లు నిర్మించడంపై మాత్రం అధికారులు దృష్టిసారించలేదు. ప్రభుత్వ కార్యాలయంలో వీటి సౌకర్యం లేకపోవడంతో మహిళలు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

కానరాని మరుగుదొడ్లు

నార్నూర్‌లో 23, గాదిగూడలో 25 ఉమ్మడి మండలంలో మొత్తం 48 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో ఒక్క జీపీల్లో మరుగుదొడ్లు లేవు. కొన్ని పంచాయతీ కార్యాలయాలకు నూతనంగా నిర్మించిన భవనాల్లో మరుగుదొడ్లు ఉన్నప్పటికి అవి వినియోగంలో లేదు. కొత్తగా ఏర్పడిన పంచాయతీలు అద్దె భవనాల్లో కొనసాగుతుండడంతో అక్కడ పరిస్థితి అధ్వానంగా ఉంది. పాత పంచాయతీల్లో పాలకులు నేటి వరకు మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టలేదు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు పదవీ బాధ్యతలు చేపట్టి దాదాపు మూడేళ్ల పూర్తి కావస్తున్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీనికి తోడు కొన్ని పంచాయతీ భవనాలు శిథిలావస్థకు ఉండడంతో నిర్మాణాలు చేపట్టడానికి ఇబ్బంది పడుతున్నారు. దీంతో మహిళా సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

సమావేశాల సమయంలో ఇబ్బందులు..

పంచాయతీ కార్యాలయంలో ప్రతినెల పాలకవర్గ సమావేశాలు, రెండు నెలలకోసారి గ్రామసభలు నిర్వహించాల్సి ఉంటుంది. సమావేశాలకు వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు అత్యవసర పరిస్థితి ఎదురైతే దూరంగా పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు ప్రభుత్వం 50 శాతం రిజర్వేషన్లు కేటాయించడంతో ఉమ్మడి మండలంలో సగం మంది మహిళా ప్రజాప్రతినిధులే ఉన్నారు. వీరితోపాటు కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు గ్రామసభలకు వస్తారు. మరుగుదొడ్లు లేకపోవడంతో వారు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు.

మరుగుదొడ్ల నిర్మాణంపై దృష్టి



పంచాయతీ కార్యాలయాల్లో మరుగుదొడ్ల నిర్మాణంపై దృష్టి సారిస్తాం. కొత్త పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు లేక ఇబ్బందిగా ఉంది. నూతనంగా నిర్మించిన భవనంలో మరుగుదొడ్డి వినియోగంలోకి తీసుకువస్తాం. – రమేశ్, ఎంపీడీవో, నార్నూర్

క్లుప్తంగా

సీఎస్‌ను కలిసిన ఎన్‌ఎస్‌యూఐ నాయకులు



పుష్పగుచ్ఛాలు అందిస్తున్న శాంతన్‌రావు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శాంతికుమారిని ఆదిలాబాద్ జిల్లా ఎన్ఎస్‌యూఐ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సెక్రెటరియేట్‌లో కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. సీఎస్‌ను కలిసిన వారిలో శాంతన్‌రావు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా గతంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన విషయాన్ని గుర్తు చేశారు.

స్టడీ సర్కిళ్లలో వసతులు కల్పిస్తాం

ఆదిలాబాద్‌రూరల్: నిరుద్యోగ అభ్యర్థులకు ప్రభుత్వం నోటిఫికేషన్లను విడుదల చేస్తోందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఉచిత శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు మంగళవారం గ్రూప్–3, 4 పరీక్షల స్టడీ మెటీరియళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న కృషితో స్టడీ సర్కిళ్లలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిరోధక చట్టం తేవాలి



మాట్లాడుతున్న రవీందర్

ఆదిలాబాద్‌టౌన్: మూఢనమ్మకాల నిరోధక చట్టం తీసుకురావాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నూతల రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో మంగళవారం జన విజ్ఞాన వేదిక వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అనేక అశాస్త్రీయ ఆలోచనలు, మూఢ నమ్మకాలతో ప్రజలు నష్టపోతున్నారని తెలిపారు. అలాంటి సమాజాన్ని రక్షించడానికి నిరోధక చట్టం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జన విజ్ఞాన వేదిక ద్వారా మూఢ నమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్, కోశాధికారి శ్రీధర్‌బాబు, నాయకులు శ్రీనివాస్, గంగయ్య, ఉమాకాంత్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాలను సమయానికి తెరవాలి



చిన్నారులతో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాలను సమయానికి తెరవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. మండల కేంద్రంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పూర్వప్రాథమిక విద్య కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం జరుగుతున్నాయా.. లేదా అనే విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే గర్భిణి, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

ఇచ్చోడ: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కుల నారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇచ్చోడలో బోథ్ నియోజకవర్గ దివ్యాంగుల సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి నియోజవకర్గంలో ఉన్న దివ్యాంగులు హాజరుకావాలని సూచించారు. ఇసాక్, నమాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని ఘన్‌పూర్‌లో రాథోడ్ లక్ష్మణ్ సతీమణి జన్నబాయి, అదే గ్రామానికి చెందిన రాథోడ్ గోవింద్ మృతిచెందారు. కాగా తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ మంగళవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, జిల్లా కార్యదర్శి రంజిత్, ఓబీసీ మోర్చా సోషల్ మీడియా ఇన్‌చార్జి శ్రీకాంత్, సర్పంచ్ జాదవ్ గులాబ్, ప్రశాంత్, రవికాంత్, అరవింద్, భగవాన్‌దాస్, ఉమాజీ మహరాజ్, సత్యనారాయణ, ఇందల్, సుభాష్, కాన్సీరాం ఉన్నారు.

హరితవనం పార్కు సందర్శన



పార్కును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్లు

ఆదిలాబాద్‌రూరల్: మావల సమీపంలోని హరితవనం పార్కును బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్లు క్రిశాంక్, దినేష్ మంగళవారం సందర్శించారు. బీఆర్ఎస్ నాయకుడు జోగు మహేందర్ వారికి హరితవనం గురించి వివరించారు. పచ్చదనం పరిరక్షణకు స్థానికంగా తీసుకున్న చర్యలను వారు అభినందించారు. హరితవనంలో ప్రజలు, చిన్నారులకు ఆహ్లాద వాతావరణం అందించేందుకు వీలుగా అందుబాటులో ఉంచిన పలు పరికరాలు, సౌకర్యాలను పరిశీలించారు. వాటి నిర్వహణ పట్ల అభినందనలు తెలిపారు. జైనథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌యాదవ్, స్వాస్ అధ్యక్షుడు కారింగుల ప్రణయ్ ఉన్నారు.

చెట్లతోనే మానవ మనుగడ



మొక్క నాటి నీరు పోస్తున్న డాక్టర్ రవికిరణ్ యాదవ్

నేరడిగొండ: చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని హోమియోపతి డాక్టర్ రవికిరణ్ యాదవ్ అన్నారు. కొయ్యాడి గంగయ్య ఆహ్వానం మేరకు మంగళవారం ఆయన మండలంలోని కుప్టి గ్రామంలో కేసీఆర్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. అనంతరం మాట్లాడుతూ యాదవ, బీసీ సామాజిక వర్గాలు రాజకీయాల్లో రాణించాలని సూచించారు. యువత విద్యా వ్యవస్థలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికిరణ్ యాదవ్‌ను సన్మానించారు. కుమారి సర్పంచ్ రాజుయాదవ్, ఎంపీటీసీ సవిత చంద్రశేఖర్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి, యాదవ సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, వీడీసీ చైర్మన్ నవీన్ చారి, కుమారి, తర్నం గ్రామ యాదవులు పాల్గొన్నారు.

అన్ని కుల సంఘాలకు ప్రాధాన్యత

- ఎమ్మెల్యే జోగురామన్న



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులసంఘాల వారికి సమ ప్రాధాన్యత ఇస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదిలాబాద్ జిల్లా ఓం శివమహేశ్వర మాల జంగం సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాల జంగం సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కాగా పట్టణంలో ఓం శివమహేశ్వర మాల జంగం సంఘం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యేను కోరగా, సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాజరి వినోద్‌కుమార్, దేవళ్ల శంకరయ్య, గౌరవ అధ్యక్షుడు రాజమల్లు, కోశాధికారి గాజరి సంతోష్, సంయుక్త కార్యదర్శి మాదం మల్లయ్య, కార్యవర్గ సభ్యులు గాజరి చంద్రశేఖర్, గాజరి శ్రీకాంత్, మాటూరి లాస్మయ్య, అల్లురి జ్ఞానేశ్వర్, మాదం రామయ్య, కోదాడి రాజేశ్వర్, గణపురం రవి, తాండ్ర వెంకటేశ్ పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు

తాంసి: భీంపూర్ మండలం నిపాని గ్రామంలోని శ్రీ భూగోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఐదు రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు శివదత్తగిరి మహారాజ్ ఆధ్వర్యంలో వేద పండితులు రాంగోపాల్‌చార్యులు, ఉమాకాంత్ శర్మలు మంత్రోచ్చారణల నడుమ కల్యాణతంతు జరిపించారు. తాంసి, భీంపూర్, తలమడుగు మండలాల నుంచే కాక మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, ఆయన తనయుడు విశ్వజిత్ హాజరై పూజలు చేశారు. భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన లడ్డూను వేలంలో జిట్ట ప్రదీప్‌రెడ్డి రూ.41వేలకు దక్కించుకున్నారు. మాజీ ఎంపీ నగేశ్, బీజేపీ నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు గండ్రత్ సుజాత, డీసీసీబీ మాజీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, సర్పంచ్ రాజన్న, ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, సభ్యులు సుగుణాకర్‌రెడ్డి, సంతోష్, సంతోష్‌రావు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అనిల్, కొండయ్య చౌదరి, దేవన్న పాల్గొన్నారు.

అందరి సహకారంతో సంఘం అభివృద్ధికి కృషి



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సన్మానిస్తున్న బీసీ సంఘాల నేతలు

ఆదిలాబాద్‌రూరల్: అందరి సహాయ సహకారంతో ఏడేళ్లపాటు సంఘం అభివృద్ధికి తమవంతుగా కృషి చేశామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈర్ల సత్యనారాయణ, కోరెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లాకేంద్రంలోని సంఘ భవనంలో బీసీ కులాలతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. గత కొన్నేళ్ల పాటు సంఘ అభివృద్ధికి, బీసీ కులాల సంక్షేమానికి కృషి చేసినా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ సంఘంలోని సభ్యులతోపాటు అన్ని బీసీ సంఘాల నాయకులు తమకు అన్నివిధాలుగా అండగా ఉన్నారన్నారు. నాయకులు చిక్కాల దత్తు, ప్రమోద్‌కుమార్ ఖత్రి, అంజయ్ కుమార్, శ్రీనివాస్, స్వదీప్‌సింగ్ ఠాకుర్, అన్నదానం జగదీశ్, సామల ప్రశాంత్, పసుల ప్రతాప్, రఘువీర్ యాదవ్, హన్మాండు యాదవ్, అసుర రమేశ్, నర్ర నవీన్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ నైనత

జైనథ్: ఈనెల 19 నుంచి ప్రారంభించనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జైనథ్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నైనత కోరారు. మండల కేంద్రంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వందరోజుల పాటు గ్రామాల వారీగా కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరిని పరీక్షించనున్నట్లు పేర్కొన్నారు. దృష్టి లోపం ఉన్నవారికి కళ్లద్దాలు అందిస్తారని తెలిపారు. ఎంపీడీవో గజానన్‌రావ్, ఎంపీవో వెంకట్‌రాజు, మెడికల్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ కోరారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో కంటి వెలుగుపై ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వైద్యారోగ్య సిబ్బంది ఆయా గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని సూచించారు. కాగా జెడ్పీటీసీ తమవంతు సహకారంగా 32 గ్రామపంచాయతీలకు రూ.వెయ్యి చొప్పున అందజేశారు. ఎంపీపీ రాథోడ్ సజన్, ఎంపీడీవో అబ్దుల్ సమద్, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎండీ సద్దాం, తహసీల్దార్ పవన్‌చంద్ర, కంటి వెలుగు వైద్యాధికారి స్వప్న, ఎంపీవో శోభన, ఆర్‌ఐ నాగోరావు, సర్పంచ్ వెంకటరమణ, సర్పంచులు, కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే జోగు రామన్న క్షమాపణ చెప్పాలి'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఇంద్రవెల్లి: 'ప్రజాగోస బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా గడప గడపకూ పార్టీ నేత మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ చేస్తున్న ప్రచారాన్ని తప్పుపడుతూ ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ఎన్నికల బిచ్చగాళ్లంటూ చేసిన వ్యాఖ్యలు సరికావని, ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉట్నూర్‌లో జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ దుప్పట్ల పంపిణీలో భాగంగా ఎమ్మెల్యే జోగు రామన్న బీజేపీ నేత రాథోడ్ రమేశ్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా సమస్యలే ఉన్నాయని, అవినీతి పాలనను తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరప రాజు, స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ దీపక్‌సింగ్ షెకావత్, బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, నాయకులు రాథోడ్ భీంరావ్, గేడం భరత్, సుధీర్, ముండే రాజేశ్వర్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన ర్యాలీ



రైతులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఏవో దివ్య

నార్నూర్: 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రభుత్వం ప్రకటించిందని ఏవో జాదే దివ్య అన్నారు. గాదిగూడ మండల కేంద్రంలోని కుమురంభీం చౌక్ వరకు మంగళవారం చిరు ధాన్యాలపై రైతులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాల వల్ల కలిగే ఉపయోగాలు, ప్రయోజనాలను వివరించారు. వానాకాలం సీజన్ నాటికి చిరుధాన్యాలు సాగు చేసేలా రైతులు సిద్ధం కావాలన్నారు. రాయిసెంటర్ సార్‌మేడి దౌలత్‌రావు, గ్రామ పటేల్ భీంరావు, ఏఈవో నాగోరావు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎస్సై సాయన్న

నేరడిగొండ: రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని నేరడిగొండ ఎస్సై సాయన్న అన్నారు. మంగళవారం రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద జరిగిన రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యులు నేత్రపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆరేపీ అసోసియేట్ టీం లీడర్ ఎ.ప్రసన్నకుమార్, ఆర్‌ఈ సురేంద్రబాబు, ఏహెచ్‌ఎంఈ నసీమ్, పటేల్ కేఎస్‌ఆర్ సంస్థ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి కె.రామ్‌మోహన్‌రెడ్డి, టోల్‌ప్లాజా ఇన్‌చార్జి పూసపత్రి వినేష్, పెట్రోలింగ్, అంబులెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేముల రోహిత్ వర్ధంతి

ఇంద్రవెల్లి: వేముల రోహిత్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఖానాపూర్ నియోజకవర్గ భీం ఆర్మీ అధ్యక్షుడు పరత్వాగ్ దత్త పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వేముల రోహిత్ 7వ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వవిద్యాలయాల్లో కుల గజ్జిని రూపుమాపడానికి కృషి చేసిన వ్యక్తి రోహిత్ అని వక్తలు పేర్కొన్నారు. మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు కాంబ్లే అతిష్, ఉపాధ్యక్షుడు భాస్కర్, వంచిత్ బహుజన అఘాడి పార్టీ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే బాబాసాహెబ్, మాజీ ఎంపీటీసీ సత్యానంద్, దళిత సంఘాల నాయకులు రాజువర్ధన్, ఆచార్య దత్త, గౌతం పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

తాంసి: గిరిజన గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తోందని బీఆర్ఎస్ మండల కన్వీనర్ అరుణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేయడం లేదంటూ ఎంపీ సోయం బాపూరావు గిరిజనులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు సహకారంతో గిరిజన గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, వైస్ ఎంపీపీ రఘు, నాయకులు రమణ, గంగారం, కళ్యాణ్, గజానన్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి హుస్సేన్

బోథ్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని బోథ్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పొచ్చర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యా హక్కు, బాల్యవివాహాలు, సైబర్ నేరాలు, ఆర్థిక లావాదేవీలు, మోటారు వెహికిల్ తదితర చట్టాల గురించి తెలియజేశారు. సర్పంచ్ మల్లేశ్, న్యాయవాదులు కుమ్మరి విజయ్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

బేల: మండలంలోని సదల్‌పూర్ శివారులోని బైరందేవ్, మహాదేవ్ ఆలయాల పరిసరాల్లో కొనసాగుతున్న జంగీ జాతరలో మంగళవారం కబడ్డీ పోటీలను ఆలయ కమిటీ అధ్యక్షుడు కొరంగే శ్యాంరావు, ప్రధాన కార్యదర్శి కుషాల్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొడపే అరుణ్, సర్పంచులు కొరంగే జంగ్‌షా, తుకారాం, ఆలయ కమిటీ సభ్యులు పెందుర్ రాందాస్, కొరంగే సోనేరావు, మడావి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉదారత

ఆదిలాబాద్‌అర్బన్: దివ్యాంగుల సహాయ సంక్షేమ సంఘం నాయకులు తమ ఉదారతను చాటుకున్నారు. పట్టణంలోని పిట్టలవాడ కాలనీకి చెందిన అబ్దుల్ గఫూర్‌కు వీల్‌చైర్ అందజేశారు. వృద్ధుడైన గఫూర్ గత కొన్నిరోజుల క్రితం పక్షవాతం బారిన పడ్డాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులకు తెలపగా, వారు వీల్‌చైర్ అందజేశారు. సంఘం నాయకులు మహమ్మద్ ఇమ్రాన్, ఫైసల్ అహ్మద్ ఉన్నారు.

షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

నార్నూర్: గాదిగూడ మండలంలోని రాంపూర్ మథురతండాల్లో గురుబాబా మందిరంలో మంగళవారం షెడ్డు నిర్మాణానికి ఎంపీపీ ఆడ చంద్రకళరాజు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సహకారంతో రూ.3 లక్షలతో షెడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు ఐక్యతతో ఉండి గ్రామాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ యోగేశ్ తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

బోథ్: మండల కేంద్రంలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జిల్లా కోశాధికారి నరేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, మండల గౌరవ అధ్యక్షుడు మల్లేశ్, గంగయ్య, స్వామి, భూషణ్, సత్యనారాయణ, అనిల్‌కుమార్, మహేశ్, అడెళ్ల, ప్రవీణ్, సత్యనారాయణ, రవీందర్ పాల్గొన్నారు. అదేవిధంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సర్పంచ్ సురేందర్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజుయాదవ్, పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు శాంతపురం రాజేశ్వర్, గౌరవ అధ్యక్షుడు బత్తుల ఊశన్న, జిల్లా సంయుక్త కార్యదర్శి బొజ్జ రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

29న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆదిలాబాద్‌టౌన్: సరస్వతి విద్యాపీఠ స్వర్ణోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని శారదధామం బండ్లగూడ జాగిర్‌లో ఈనెల 29న పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థి పరిషత్ నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సరస్వతి శిశుమందిర్‌లో చదివిన విద్యార్థులు ఈ వేడుకలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.